

బాబోయ్..చలి!

- పడిపోతున్న ఉష్ణోగ్రతలు
- తట్టుకోలేకపోతున్న జనం

పరిగి,నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో చలి తీవ్ర రోజు రోజుకూ పెరుగుతోంది. బుధవారం వికారాబాద్ జిల్లా నవాబుపేట మండలం నవాబుపేటలో 10.1 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. అలాగే మేడ్చల్-మల్కాజిరిగి జిల్లా మూడుచింతలపల్లిలో 12.1 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదు కాగా రంగారెడ్డి జిల్లా చౌదరిగూడెం మండలం కాస్లాబాద్‌లో 10.6 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదు నమోదైంది. మూడు రోజులుగా పగటి, రాత్రి పూటల ఉష్ణోగ్రతలు పడిపోవడానికి తోడు, చలిగాలులు వీస్తున్నాయి. బుధవారం పరిగిలో కనిష్ఠ ఉష్ణోగ్రత 15 డిగ్రీలసెల్సియస్ నమోదైంది. పొలానికి, పనులకు వెళ్లే రైతులు అయితే నానా అవస్థలు పడుతున్నారు. చలికారణంగా వైరల్ సంబంధిత జబ్బులు వచ్చే అవకాశం ఉందని, జాగ్రత్తలు పాటించాలని పరిగి మండల వైద్యాధికారి డాక్టర్ ఎస్.ప్రవీణ్ పేర్కొన్నారు.

సమగ్ర సర్వేలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- మేడ్చల్ కలెక్టర్ గౌతమ్
- మల్లారెడ్డి కాలేజీలో డాటా ఎంట్రీ పరిశీలన
- నమోదులో నిర్లక్ష్యం వహించిన ఇద్దరు ఎన్యూమరేటర్ల సస్పెన్షన్‌కు ఆదేశాలు


డాటా ఎంట్రీని పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమ్

మేడ్చల్ ప్రతినిధి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సమగ్ర సర్వేలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన తప్పదని కలెక్టర్ గౌతమ్ హెచ్చరించారు. బుధవారం మేడ్చల్ మున్సిపల్ కిష్టాపూర్ మల్లారెడ్డి ఇంజనీరింగ్ కాలేజీలో నిర్వహిస్తున్న డాటా ఎంట్రీ ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఆపరేటర్ల పక్కన అందుబాటులో లేని ఇద్దరు ఎన్యూమరేటర్లను వెంటనే సస్పెండ్ చేయాలని కలెక్టర్ మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సర్వేలో పొరపాట్లను సహించేది లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆపరేటర్లు కేవలం ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడం వరకే బాధ్యతని, ఎలాంటి తప్పులు జరిగినా ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లదే పూర్తి బాధ్యత అని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎన్యూమరేటర్లు పక్కన ఉన్నంత సేపు ఆపరేటర్లు సర్వే వివరాలు అప్‌లోడ్ చేయాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో మేడ్చల్ తహసీల్దార్ శైలజ, కమిషనర్ నాగిరెడ్డి, ఎండీవో సంపూర్ణ పాల్గొన్నారు.

కొత్లాపూర్‌లో ఆసరా పింఛన్లు పంపిణీ


పింఛన్లను పంపిణీ చేస్తున్న బీపీఎం కుమార్

బషీరాబాద్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): పింఛన్ కోసం పడిగాపులు అంటూ బుధవారం 'ఆంధ్రజ్యోతి' జిల్లా ఎడిషన్‌లో ప్రచురితమైన కథనానికి బషీరాబాద్ ఎంపీడీవో విజయ్‌కుమార్ స్పందించారు.ఈ విషయమై స్థానిక పంచాయతీ కార్యాదర్శి విశాల్‌తో అడిగి తెలుసుకున్న ఎంపీడీవో సంబంధిత పోస్టల్‌శాఖ అధికారులతో మట్లాడి పింఛన్ల పంపిణీ ఎందుకు జరుగలేదనేదానిపై ఆరా తీశారు. వెంటనే సంబంధిత బీపీఎంను గ్రామానికి పంపించి పింఛన్ల పంపిణీ జరిగేలా చర్యలు తీసుకున్నారు. నెలనెల పింఛన్ల పంపిణీ జరిగేలా చూడాలని కార్యదర్శిని ఆదేశించారు.


మంబాపూర్‌లోని కేంద్రం వద్ద ధాన్యం నిల్వలు



సన్నాలకు సున్నం!

సన్నవడ్ల కొనుగోలుకు కొర్రీలు

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో సన్నధాన్యం కొనుగోలుకు నిర్వాహకులు కొర్రీలు పెడుతున్నారు. ధాన్యం గింజ వలిచి మరీ పరిశీలిస్తున్నారు. గింజ సైజులో తేడా ఉందంటూ తిరకాసు పెడుతున్నారు. దీనికి తోడు లారీ వడ్లు తెస్తేనే కొనుగోలు చేస్తామంటున్నారు. దీంతో రైతులు ఏమి చేయాలో తెలియక లబోదిబోమంటున్నారు. దిక్కులేక ధర తక్కువైనా ప్రైవేట్ వ్యాపారులకు విక్రయించి తీవ్రంగా నష్టపోతున్నారు. ఇంత జరుగుతున్నా అధికార యంత్రాంగం తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తుండడం గమనార్హం.

- గింజ సైజులో తేడా ఉందని తిరకాసు
- లారీ వడ్లు తేస్తేనే కొంటామని మెలిక
- కొనుగోలు కేంద్రాల్లో నిర్వాహకుల ఇష్టారాజ్యం
- దిక్కుతోచని స్థితిలో అన్నదాతలు
- గత్యంతరం లేక ప్రైవేటు వ్యాపారులకు విక్రయం
- క్వింటాల్‌కు రూ. వంద తక్కువకే అమ్మకం
- చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం

పెద్దేముల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పెద్దేముల్ మండలం మంబాపూర్, జనగాం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. కొంతమంది రైతులు సన్నధాన్యం అమ్మడానికి శాంపిల్స్ తీసుకువచ్చి చూయిస్తే వాటిని కొనుగోలు చేయడానికి కొర్రీలు పెడుతున్నారు. దీంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ధాన్యం మొత్తం లారీ లోడ్‌కు సరిపోతేనే కొంటామని నిర్వాహకులు చెపుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లారీలోడ్ కోసం తాము అన్ని వడ్లు ఎక్కడి నుంచి తీసుకు రావాలని ప్రశ్నిస్తున్నారు. రైతులు తెచ్చిన ధాన్యం వచ్చినవి వచ్చినట్లు కొనుగోలు చేయాలని కోరుతున్నారు. ఇక వాటిని యంత్రంతో పరిశీలించడానికి ధాన్యంపై పొట్టుతీసి యంత్రంలో గింజవేస్తే అందులో పొసవుతేనే

మిగతా 8వ పేజీలో...

వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- మేడ్చల్ జోన్ డీసీపీ కోటిరెడ్డి

మేడ్చల్ టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పోలీస్ కుటుంబాలు మెగా కేన్సర్ స్ర్కీనింగ్ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని మేడ్చల్ జోన్ డీసీపీ కోటిరెడ్డి కోరారు. బుధవారం గుండ్లపోచంపల్లి కండ్లకోయ పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో గ్రేస్ కేన్సర్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ క్యాంప్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ జోన్‌ల వారీగా పోలీస్ శాఖలో ఇలాంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. పోలీసులు తమ కుటుంబ సభ్యులతో కలిసి వైద్య పరీక్షలు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మేడ్చల్ ఏసీపీ శ్రీనివాస్ రెడ్డి, గ్రేస్ కేన్సర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ ప్రమీల పాల్గొన్నారు.

బాల్యవివాహాలు చేస్తే కఠిన చర్యలు

ఉపాధ్యాయులు, సామాజిక సంస్థలు ఈ విషయంలో జాగ్రత్తగా ఉండాలి
జిల్లా న్యాయసేవ అధికారి సంస్థ కార్యదర్శి డీబీ శీతల్



6

లక్ష్మాపూర్‌లో సమస్యల తాండవం

మాజీ సీఎం దత్తత గ్రామంలో ఇబ్బందులు
వెలగని వీధిలైట్లు.. తాగునీటి పైపులు లీక్
నిధులు లేక.. పరిష్కారం కాని పనులు
పట్టించుకోని అధికారులు



8

పీఎస్‌లో హోంగార్డు ఆత్మహత్యాయత్నం

భూ విషయంలో దాయాదుల మధ్య గొడవ
న్యాయం జరగలేదని సీఐ ఎదుట ఆవేదన
ఒంటిపై డీజిల్ పోసుకున్న మహ్మద్ ఘనీ
అడ్డుకున్న సిబ్బంది.. బాధితుడికి కౌన్సెలింగ్



7

సమాచారం

రైతు సదస్సుకు బస్సు సౌకర్యం

కులకచర్ల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఈనెల 28 నుంచి మూడు రోజుల పాటు మహబూబ్‌నగర్‌లో జరిగే రైతు సదస్సుల్లో పాల్గొనేందుకు ప్రత్యేక బస్సు సౌకర్యం ఏర్పాటు చేసినట్లు ఏవో వీరస్వామి బుధవారం పేర్కొన్నారు. గురు, శుక్ర, శనివారాల్లో రైతు సదస్సులు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. మండల పరిధిలో నుంచి రైతులు వెళ్లేందుకు గురువారం ఉదయం ప్రత్యేక బస్సులు కులకచర్ల ఎంపీడీవో కార్యాలయం నుంచి, ముజాహిద్‌పూర్ నుంచి బయలుదేరుతాయని తెలిపారు. ఈ సదస్సుల్లో పంటల సాగు విధానం, తెగుళ్ల నివారణ గురించి శాస్త్రవేత్తలు వివరిస్తారని తెలిపారు. రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

జాబ్‌మేళా

వికారాబాద్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు రేపు వికారాబాద్ జిల్లా ఎంప్లాయిమెంట్ కార్యాలయం ఐటీఐ క్యాంపస్‌లో జాబ్‌మేళా నిర్వంచనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనా అధికారి షేక్ అబ్దుస్ సుభాన్ బుధవారం ఒక ప్రకటనలో



తెలిపారు. ఈనెల 29న ఉదయం 10 గంటలకు జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అపోలో ఫార్మసిలో సుమారు 50 పోస్టులు భర్తీ చేయనున్నట్లు తెలిపారు. పదవ తరగతి, ఇంటర్, డిగ్రీ, బీ ఫార్మా, డీ ఫార్మా, ఎం ఫార్మసీ అర్హత కలిగిన వారు అర్హులన్నారు. వికారాబాద్, మోమిన్‌పేటలోని ప్రఖ్యాత ప్రైవేటు పరిశ్రమల్లో అవసరమైన సిబ్బందిని ఈ జాబ్‌మేళా ద్వారా ఎంపిక చేసుకుంటారని తెలిపారు. వివరాలకు 9676047444 నెంబరుకు

విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి

ఇకపై ప్రభుత్వ పాఠశాలల ఆకస్మిక తనిఖీ

- ప్రతీ సోమవారం మంచినీటి పరీక్షలు
- దుద్యాల్‌కు తహసీల్దార్ కార్యాలయం మంజూరు
- ఈవీఎంలపై అపోహలు వద్దు
- మోడల్ పీహెచ్‌సీగా నవాబుపేట ఆసుపత్రి
- విలేకరుల సమావేశంలో కలెక్టర్ ప్రతీక్ జైన్


తుంకిమెట్లలో మధ్యాహ్న భోజనం చేస్తున్న కలెక్టర్

వికారాబాద్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి పెట్టడం జరుగుతుందని, పాఠశాలలో మూవీక్లబ్ ఏర్పాటు చేయాలనే ఆలోచన ఉందని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రతీక్ జైన్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ. భవిత సెంటర్ల విషయంలో ఆలోచిస్తున్నామని అందుకు తగ్గ ఏర్పాట్లు చేయడం జరుగుతుందన్నారు. ఈవీఎంలపై

మిగతా 8వ పేజీలో...

ధాన్యం డబ్బులు త్వరగా చెల్లించాలి
ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్
8

ప్రయాణం.. ప్రాణసంకటం

- ప్రమాదమని తెలిసినా తప్పని ఫుట్‌బోర్డు ప్రయాణం
- జిల్లా శివారులో అత్యధిక కళాశాలలు
- బస్సుల కోసం విద్యార్థులకు తప్పని అగచాట్లు

ఆర్టీసీ బస్సుల్లో విద్యార్థుల ప్రమాదకర ఫీట్లు



మేడ్చల్‌లో ఫుట్‌బోర్డు ప్రయాణం

మేడ్చల్ జిల్లా ప్రతినిధి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి) : వ్యాపార, వాణిజ్య, విద్యా రంగంలో పెద్ద ఎత్తున అభివృద్ధి చెందిన మేడ్చల్ జిల్లా ప్రాంతంలో ప్రయాణ సౌకర్యాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. జిల్లా నగర శివారు చుట్టూ ఉండటం, శివారు ప్రాంతాల్లోనే ఇంజనీరింగ్ కాలేజీలు ఎక్కువగా ఏర్పాటు కావడంతో విద్యార్థులు కళాశాలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం సమయాల్లో ఆర్టీసీ బస్సులన్నీ విద్యార్థులతో కిక్కిరిసిపోతున్నాయి. జిల్లాలో మేడ్చల్, ఘటకేసర్, కీసర మార్గాల్లో పెద్ద ఎత్తున ఇంజనీరింగ్ కాలేజీలున్నాయి. నగరం నుంచి ప్రతిరోజు దాదాపు వేల మంది విద్యార్థులు కాలేజీలకు రాకపోకలు సాగిస్తుంటారు. జిల్లాలో మేడ్చల్, కుషాయిగూడ, బోడుప్పల్ ఆర్టీసీ డిపోల ద్వారా బస్సులు ప్రతి రోజు నగరంతో పాటు ఇతర ప్రాంతాలకు నడుస్తుంటాయి. అయితే బస్సులు ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా నడపటం లేదు. పెరిగిన

మిగతా 8వ పేజీలో...

కొత్త మండలాల్లో ప్రజా పరిషత్తులు!

- స్థానిక సంస్థల ఎన్నికల్లో కొత్తగా కొలువుదీరనున్న పాలకవర్గాలు
- జిల్లాలో 20కి పెరిగిన ఎంపీపీ, జడ్పీటీసీ స్థానాలు
- దుద్యాల, చౌడాపూర్‌లకు ఎంపీపీ భవనాలు మంజూరు

వికారాబాద్ జిల్లా ప్రతినిధి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గత ప్రభుత్వ హయాంలో కొత్తగా ఏర్పాటైన రెండు మండలాల్లో మండల ప్రజా పరిషత్తులు ఏర్పాటు కానున్నాయి. మండల ప్రజాపరిషత్తుల్లో కొత్తపాలక వర్గాలు కొలువుదీరిన మూడేళ్ల తర్వాత అప్పటి ప్రభుత్వం కొత్తగా రెవెన్యూ మండలాలు ఏర్పాటు చేయగా,వికారాబాద్ జిల్లాలో చౌడాపూర్, దుద్యాల మండలాలు కొత్తగా ఏర్పాటు చేసింది. అప్పటికే మండల ప్రజా పరిషత్తు పాలక వర్గాలు ఉండడంతో కొత్తగా ఏర్పాటైన చౌడాపూర్, దుద్యాల మండలకు కొత్తగా పాలకవర్గాలు ఏర్పాటు కాలేదు. ఫలితంగా జిల్లాలో మొత్తం రెవెన్యూ మండలాలు 20 ఉండగా, మండల ప్రజా పరిషత్తుల వరకొస్తూ 18గానే పరిగణిస్తున్నారు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో గత ప్రభుత్వంలో కొత్తగా ఏర్పాటైన రెవెన్యూ మండలాలను మండల ప్రజా పరిషత్తులుగా గుర్తించాలని కోరుతూ పంచాయతీ రాజ్ శాఖ పంపించిన ప్రతిపాదనలకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఫలితంగా వచ్చే స్థానిక సంస్థల్లో 20 మండల ప్రజాపరిషత్తులకు ఎన్నికలు జరగనున్నాయి. జిల్లాలో ఇప్పటి వరకు 18ఎంపీపీలు, 18జడ్పీటీసీ స్థానాలు ఉండగా, కొత్త మండల ప్రజా పరిషత్తుల ఏర్పాటుతో 20ఎంపీపీలు, 20 జడ్పీటీసీ స్థానాలకు పెరగనున్నాయి.



రెండు భవనాలు మంజూరు

కొత్త మండలాల్లో మండల ప్రజా పరిషత్తు కార్యాలయాలతో పాటు ఇతర కార్యాలయాలు కూడా ఏర్పాటు కానున్నాయి. మండల ప్రజా పరిషత్తు కార్యాలయంతో పాటు మండల వనరుల కేంద్రం, ఐకేపీభవనం తదితర కార్యాలయాలు ఏర్పాటు చేయనున్నారు. కొత్తగా ఏర్పాటు కానున్న చౌడాపూర్, దుద్యాల మండల ప్రజా పరిషత్తు కార్యాలయాలకు కొత్త భవనాలు నిర్మించేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కొత్త మండలాల్లో స్థల పరిశీలన పూర్తయితే మండల ప్రజా ప్రతిషత్తు కార్యాలయాల భవనాల నిర్మాణానికి అధికారులు చర్యలు తీసుకోనున్నారు.

డయల్ 100కాల్స్‌పై నిర్లక్ష్యం చేయొద్దు

- ఎస్పీ నారాయణరెడ్డి


మాట్లాడుతున్న ఎస్పీ నారాయణరెడ్డి

వికారాబాద్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) :డయల్ 100 కాల్స్‌పై నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ నారాయణరెడ్డి తెలిపారు. బుధవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. జిల్లాలోని పోలీస్ స్టేషన్లలో కేసుల నిర్వహణ, ప్రజల సమస్యల పరిష్కారానికి పోలీసులు మరింత జాగ్రత్తగా ఉండాలన్నారు. . పెండింగ్ కేసులను తక్షణమే పూర్తి చేయాలని అలాగే అన్ని కేసులను ఆన్‌లైన్‌లో నమోదు చేయడం విధిగా పాటించాలన్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదు దారుడి సమస్యను సకాలంలో పరిష్కరించడానికి ప్రయత్నించాలన్నారు. అనంతరం కేసుల ఫైల్స్‌ను పరిశీలించి సూచనలు చేశారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి, పరిగి, వికారాబాద్, తాండూరు డీఎస్పీలు, అధికారులు, సీఐలు, ఎస్ఐలు, ఆర్ఐలు పాల్గొన్నారు.

ప్లైవుడ్ కంపెనీపై చర్యలు తీసుకోవాలి

పరిగి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మాదారంలో పవన్ ప్లైవుడ్ కంపెనీలో మృతి చెందిన కార్మికుడు మోహిత్‌కుమార్ కుటుంబానికి రూ.30 లక్షల పరిహారాన్ని అందించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మహిపాల్, రామకృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం వారు కంపెనీని సందర్శించి కార్మికుడి మృతికి కారణాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇతర రాష్ట్రాలకు చెందిన 80 మంది కార్మికులు ఈ కంపెనీలో పని చేస్తున్నట్లు గుర్తించామన్నారు. పాములు, పంది కొక్కుల మధ్య కార్మికులు నివసిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎలాంటి భద్రతా చర్యలు చేపట్టని కంపెనీ యజమాన్యంపై కార్మికశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బాల్య వివాహాలు జరిపిస్తే కఠిన చర్యలు

జిల్లా న్యాయసేవ అధికారి సంస్థ కార్యదర్శి డీబీ శీతల్


అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న డీబీ శీతల్

వికారాబాద్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు నిర్వహిస్తే సంబంధిత వ్యక్తులపై చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని జిల్లా న్యాయ సేవ అధికారి సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి డీబీ శీతల్ హెచ్చరించారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాల్య వివాహాల నిర్మూలనలో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన న్యాయమూర్తి మాట్లాడుతూ పెద్దలు, ఉపాధ్యాయులు సామాజిక సంస్థలు ఈ విషయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. బాల్య వివాహాలు జరుగుతున్న విషయాన్ని పోలీసులకు లేదా సంబంధిత అధికారులకు వెంటనే తెలపాలన్నారు. బాల్య వివాహాల వల్ల బాలికలు శారీరకంగా, మానసికంగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటారన్నారు. పెళ్లి తర్వాత ఆ దంపతులు జీవితాలు అనేక సమస్యల మధ్య నడుస్తాయని వివరించారు. అందుకే సమాజంలోని ప్రతి ఒక్కరూ ఇలాంటి వివాహాలను నిరోధించడంలో తమ వంతు సహకారం అందించాలన్నారు. ఇతర ప్రాంతాలలో బాల్య వివాహాలు జరిగితే కూడా స్థానిక అధికారులకు సమాచారం ఇచ్చి వారికి సాయం అందించాలని సూచించారు. అనంతరం బాల్య వివాహాల నిర్మూలన కోసం కృషి చేస్తామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు

ఘనంగా పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు

కొడంగల్ రూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెద్దనందిగామ గ్రామంలో పోచమ్మ విగ్రహ పునఃప్రతిష్ఠాపనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. బుధవారం ఉదయం గ్రామంలో అమ్మవారి విగ్రహాన్ని నందికోల విన్యాసాలు, అడుగుల భజనల మధ్య ఊరేగిస్తూ ఆలయం వరకు తీసుకెళ్లారు. అనంతరం గోవు పూజ, గణపతి పూజ, హోమం, వివిధ కార్యక్రమాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. నేడు అమ్మవారి విగ్రహ పునఃప్రతిష్ఠ కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

కాంగ్రెస్ ధ్యేయం.. సామాజిక న్యాయం

ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్‌రెడ్డి


కాంగ్రెస్ నేతలతో చల్లా వంశీచంద్ రెడ్డి

ఆమనగల్లు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సామాజిక న్యాయం, సమానత్వమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ఏఐసీసీ కార్యదర్శి, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్ రెడ్డి అన్నారు. కల్వకుర్తి నియోజకవర్గంలోని ఆమనగల్లు, కడ్తాల, మాడ్గుల, తలకొండపల్లి మండలాలకు చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో బుధవారం తుక్కుగూడ వద్ద ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వంశీచంద్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర సంపదను పెంచి సామాజిక వర్గాల వారీగా పంచి వారి ఆర్థికాభివృద్ధికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం బాటలు వేస్తుందన్నారు. కుల గణన ఫలితాల ఆధారంగానే ప్రభుత్వం విధానాలు రూపొందిస్తుందని చెప్పారు. కుల గణన అంటే కేంద్రంలోని బీజేపీకి వణుకు పుడుతుందన్నారు. రానున్న స్థానిక సంస్థ ఎన్నికలకు కాంగ్రెస్ శ్రేణులంత సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ్మ, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు కృష్ణ, రమేశ్, శ్రీను, కృష్ణనాయక్, శ్రీను నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు ఇబ్బందులు రానీయొద్దు

» బాలసదనంలో సమస్యలను పరిష్కరిస్తాం

» వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్



కలెక్టర్ ప్రతీక్‌జైన్‌తో మాట్లాడుతున్న లాల్‌కృష్ణప్రసాద్

పరిగి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): బాలసదనంలో చిన్నారులకు ఎలాంటి ఇబ్బందులు రానీవ్వొద్దని, వారికి అవసరమైన కనీస వసతులు అన్నీ కల్పించాలని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ సూచించారు. బుధవారం ఆయన పరిగి బాలసదనాన్ని సందర్శించారు. అక్కడ నెలకొన్న సమస్యలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అంసపూర్తిగా ఉన్న భవనం గురించి ఆరా తీశారు. దాన్ని పూర్తి చేసేందుకు కావాల్సిన నిధులు సమకూరుస్తామని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అక్కడున్న సమస్యలను వెంటనే పరిష్కారిస్తామన్నారు. పిల్లలకు భోజనం కూడా నాణ్యతగా అందించాలని సూచించారు. బాలసదనంలో అందరూ తల్లిదండ్రులను కోల్పోయినవారే ఉంటారని, వారి పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారిణి కృష్ణవేణి, తహసీల్దార్ ఆనంద్‌రావు, ఎంపీడీవో కరీం, సూపర్‌వైజర్లు నిర్మల తదితరులు పాల్గొనారు.

బీసీ హాస్టళ్లలో కనీస వసతులు కల్పించాలి

బీసీ వసతి గృహాల్లో సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్‌కు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.లాల్‌కృష్ణప్రసాద్ వినతిపత్రాన్ని అందజేశారు. వసతి గృహాల్లో కనీస వసతులు లేక విద్యార్థులు నానా ఇబ్బందులు పడుతున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. పరిగిలో బీసీ బాలుర, అంతారంలో బీసీ హాస్టల్ భవనాలు శిథిలావస్థలో ఉన్నాయన్నారు. కిటికీలు, తలుపులు లేక చలికి విద్యార్థులు గజగజ వణికిపోతున్నారని తెలిపారు. మరుగుదోడ్లు, మూత్రశాలలు కూడా శిథిలావస్థకు చేరుకున్నాయని తెలిపారు. వెంటనే కనీస మరమ్మతులు చేయించాలని కలెక్టర్‌ను కోరగా, ఆయన సూనుకూలంగా స్పందించారని తెలిలిపారు.



కళకళలాడుతున్న వేరుశనగ పంట

రైతన్న చూపు వేరుశనగ వైపు

యాసంగిలో పెరిగిన సాగు విస్తీర్ణం

» ఆరుతడి పంటల సాగుకు అధికారుల సూచన

» పెట్టుబడి ఎక్కువైనా లాభాలపై ఆశలు

ఆమనగల్లు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): వేరుశనగ పంట రైతుల్లో ఆశలు రేకెత్తిస్తోంది. ఆమనగల్లు వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో వందల ఎకరాల్లో వేరుశనగ పంట కళకళలాడుతోంది. ఆరుతడి నూనె గింజల పంటల్లో వేరుశనగకు ప్రత్యేక స్థానం ఉంది. ఈ పంటకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండడం, 90 రోజుల్లో పంట చేతికి వస్తుండడంతో యాసంగిలో రైతులు ఆ పంట సాగుకు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. పెట్టుబడితో కూడుకున్నదే అయినా అధిక లాభాలు వస్తాయన్న ధీమాతో రైతులు మక్కువ కనబరుస్తున్నారు.

అధిక దిగుబడిపై ఆశలు

ఆమనగల్లు సబ్ డివిజన్‌లో వేరుశనగ పంట సాగుకు భూములు అనువైనవిగా ఉంటాయి. దీంతో ఏటా యాసంగిలో వేరుశనగ పంటను సాగు చేస్తున్నారు. వరికి ప్రత్యమ్నాయంగా వేరుశనగ సాగు చేస్తే అధిక దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. దీంతో రైతులు ఈ పంట సాగు చేసుకునేందుకు ముందుకు వస్తున్నారు. ఆమనగల్లు సబ్‌డివిజన్ పరిధిలోని ఆమనగల్లులో 1,500ల ఎకరాలు, మాడ్గులలో 200, తలకొండపల్లిలో 2,300, కడ్తాలలో 120 ఎకరాలలో వేరుశన పంట ఈ ఏడాది సాగు చేశారు. వేరుశనగ విత్తనాలు రూ.13,500 నుంచి రూ.14 వేల వరకు రైతులు కొనుగోలు చేసి సాగు చేస్తున్నారు.

ఊడల దశలో పంట

నేల స్వభావాన్ని బట్టి ఎకరాకు 12 నుంచి 15 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని రైతులు చెబుతున్నారు. రూ. 20 వేలు పెట్టుబడి అవుతుందని పేర్కొంటున్నారు. గతేడాది వేరుశనగ క్వింటాల్‌కు రూ.7 వేల వరకు ఉండడంతో ఈ ఏడాది రైతులు అధికంగా ఆసక్తి కనబరుస్తున్నారు. సెప్టెంబర్ నుంచి వేరుశనగ సాగు ప్రారంభమైంది. పత్తి పంట ముగియడంతో దాని స్థానంలో వేరుశనగనే సాగు చేస్తున్నారు. అక్కడక్కడ వేరుశనగకు తెగుళ్లు సోకినప్పటికీ ఈ ఏడాది పంట ఆశాజనకంగా ఉందని వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఇటీవల వేరుశనగ సాగు ప్రారంభించారు. పంట ప్రారంభ దశ(ఊడల దశ)లో ఉంది.

పది ఎకరాల్లో సాగుచేశా



యాసంగిలో ఆరుతడి పంటగా పది ఎకరాల్లో వేరుశనగ సాగు చేశా. ప్రస్తుతం పంట ఊడ దశలో ఉంది. కల్వకుర్తిలో విత్తనాలు కొనుగోలు చేసి తీసుకువచ్చాం. పది ఎకరాలకు 9 క్వింటాళ్ల విత్తనం ఉపయోగించాం. ఇప్పటి వరకు రూ.2.50 లక్షలు పెట్టుబడి అయ్యింది. ఇటీవల తెగుళ్ల సోకగా సస్యరక్షణ చర్యలు చేపట్టాం. ప్రస్తుతం పంట ఆశాజనకంగా ఉంది.

-రూపం వెంకట్‌రెడ్డి, రైతు, చింతలపల్లి

వరికి ప్రత్యామ్నాయంగా..



మార్కెట్‌లో వేరుశనగకు డిమాండ్ ఉండడంతో వరికి ప్రత్యమ్నాయంగా నాలుగు ఎకరాలలో సాగు చేశా. గతేడాది మొక్కజొన్న పంట వేశా. వ్యవసాయ అధికారుల సూచన మేరకు పంట మార్పిడి చేసి యాసంగిలో వేరుశనగ పంట వేశాను.పెట్టుబడి ఎక్కువైనా వచ్చే దిగుబడితో ఆదాయం తెచ్చిపెడుతుందని చాలా మంది రైతులు వేరుశన సాగు చేశారు.

-నేజ్యనాయక్, రైతు, కొండ్రిగాని బోడు తండా

వేరుశనగతో అధిక లాభాలు



మేలు రకం విత్తనాలు ఎంచుకొని సస్య రక్షణ చర్యలు పాటిస్తే వేరుశనగ పంటలో అధిక దిగుబడి పొంది లాభాలు గడించవచ్చు. తక్కువ నీటితో ఎక్కువ పంటసాగు చేసుకోవచ్చు. ఈ ఏడాది యాసంగిలో వేరుశనగ సాగు విస్తీర్ణం పెరిగింది. ప్రస్తుతం పంట ఆశాజనకంగా ఉంది. రైతులు తెగుళ్ల నివారణకు తగిన సస్య రక్షణ చర్యలు చేపట్టాలి.

- శ్రీనివాస్ గౌడ్, ఏవో, ఆమనగల్లు

'సూదిని'కి కార్పొరేషన్ పదవి!

చైర్మన్ పదవికి రాంరెడ్డి పేరు పరిశీలన



ఆమనగల్లు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మాడ్గుల మండల కేంద్రానికి చెందిన టీపీసీసీ కార్యదర్శి, మాజీ ఎంపీపీ సూదిని రాంరెడ్డికి కాంగ్రెస్ ప్రభుత్వం సముచిత స్థానం కల్పించనున్నట్లు జోరుగా ప్రచారం సాగుతోంది. డిసెంబర్ మొదటి వారంలో భర్తీచేసే రాష్ట్రస్థాయి కార్పొరేషన్ చైర్మన్లలో ఆయనకు అవకాశం కల్పిస్తున్నట్లు సమాచారం. కార్పొరేషన్ చైర్మన్‌గా రాంరెడ్డికి అవకాశం కల్పించాలని నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నారు. కల్వకుర్తి నియోజకవర్గంలో దశాబ్దాలుగా రాంరెడ్డి పార్టీకి అందిస్తున్న సేవలను గుర్తించాలని కొందరు నేతలు ఇటీవల సీఎం రేవంత్ రెడ్డిని కలిసి కోరినట్లు సమాచారం. రాజకీయాల్లో సౌమ్యుడిగా పేరున్న ఆయనకుసీఎం తో బంధుత్వం ఉంది. ఆయన పేరును స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి, ఎంపీ మల్లు రవి ఇప్పటికే ప్రతిపాదించి ప్రభుత్వానికి సిఫారస్సు చేసినట్లు తెలిసింది.

అభివృద్ధికి సహకరించాలి

రంగారెడ్డి అర్బన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : సీఎస్ఆర్(కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బులిటీ) నిధులు సకాలంలో అందించి ఆరోగ్యం, విద్యకు తోడ్పాటును అందించాలని అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ పారిశ్రామికవేత్తలను కోరారు. బుధవారం కలెక్టరేట్‌లో ప్రధాన పరిశ్రమల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయలు, ఫర్నిచర్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆసుపత్రులలో అవసరమైన వసతుల కల్పనకు సహకరించాలన్నారు. ఇప్పటికే వివిధ రంగాల్లో సీఎస్ఆర్ కింద సహకారం అందిస్తున్న పారిశ్రామిక వేత్తలందరినీ అదనపు కలెక్టర్ అభినందించారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల అధికారి శ్రీలక్ష్మి, ప్రధాన పరిశ్రమల ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



ధాన్యంలో తేమను పరిశీలిస్తున్న లింగ్యానాయక్

తూకం వేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించాలి

» అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

కులకచర్ల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): తూకం వేసిన ధాన్యాన్ని వెంటనే లారీల ద్వారా మిల్లులకు తరలించాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ సూచించారు. బుధవారం మండల పరిధిలోని సాల్విడ్ గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆర్డీవో వాసుచంద్రతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు, నిర్వాహకులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. వర్షం వస్తే ధాన్యం తడిసిపోకుండా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. తూకంలో రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గన్నీ బస్తాల కొరత లేదని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం శోభ తదితరులు పాల్గొన్నారు.

పీఎస్‌లో హోంగార్డు ఆత్మహత్యాయత్నం

భూ వివాదంలో న్యాయం జరగలేదని మనస్థాపం

సీఐ ఎదుటే డీజిల్ పోసుకొని హల్‌చల్

ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): తనకు న్యాయం జరగలేదని మనస్తాపానికి గురైన ఓ హోంగార్డు ఒంటిపై డీజిల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. ఘట్‌కేసర్ మండలం ఎదులాబాద్ అనుబంధ గ్రామం కొత్తగూడానికి చెందిన మహ్మద్ ఘనీ(39) చర్లపల్లి పీఎస్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్నాడు. ఎదులాబాద్ రెవెన్యూ పరిధి సర్వే నంబర్లు 258, 268లలో 30 గుంటల భూమి వారసత్వంగా సంక్రమించింది. ఆ భూమి చుట్టు ప్రహరీ నిర్మిస్తుండగా, ఘనీ దాయాదులు అఫ్జల్, జబ్బార్ ఆ భూమిలో తమకు వాటా వస్తుందని ప్రహరీ పనులను అడ్డుకున్నారు. దీంతో ఘనీ ఈనెల 26న ఘట్‌కేసర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. అదే రోజు సీఐ పరుశురాం ఇరువర్గాలను పిలిచి కోర్టు ఉత్తర్వులు ఉంటే తప్ప అడ్డుకోవడానికి లేదని ప్రత్యర్థులకు చెప్పి పంపించాడు. మరుసటి రోజు ప్రహరీ నిర్మాణం చేపడుతుండగా అఫ్జల్, జబ్బార్‌లు మళ్లీ అడ్డుకున్నారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా నిర్మాణాన్ని అడ్డుకుంటున్నారని మనస్తాపానికిగురైన ఘనీ డీజిల్ బాటిల్‌ను బ్యాగ్‌లో పెట్టుకొని పోలీసుస్టేషన్‌కు వెళ్లాడు. సీఐ చాంబర్‌లోకి వెళ్లి ఆయన ఎదుటే డీజిల్ ఒంటిపై పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. తేరుకున్న సీఐ, పోలీసు సిబ్బంది ఘనీ చేతిలోని బాటిల్‌ను లాక్కున్నారు. వెంటనే అతన్ని అదుపులోకి తీసుకొని కౌన్సెలింగ్ ఇచ్చారు. ఘనీకి ఏమీ కాకపోవడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మూతబడిన ఇరికుంట తండా పాఠశాల

» 40 రోజులుగా రాని ఉపాధ్యాయుడు



శంకర్‌పల్లి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఇరికుంట తండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల మూతబడింది. సుమారు 40 రోజుల నుంచి పాఠశాలకు ఉపాధ్యాయుడు రాకపోవడంతో, విద్యార్థులకు పాఠాలు చెప్పే దిక్కులేదు. 2024 డీఎస్సీలో ఉపాధ్యాయుడుగా ఎంపికైన బర్కమ్ శ్రీశైలం అక్టోబరు 16న ఎంఈఓ కార్యాలయానికి వచ్చి విధుల్లో చేరాడు. అయితే ఆయనకు దృష్టి లోపం ఉండటంతో తల్లిదండ్రులతో కలిసి పాఠశాలకు వెళ్లాడు. ఏమైందో తెలియదు కాని పాఠశాలను చూసిన మరునాడు నుంచి పాఠశాలకు రావడం లేదు. అప్పటి నుంచి పాఠశాలను ఎవరూ తెరిచే దిక్కులేకుండా పోయింది. ఇంతకు ముందు చేవెళ్ల మండలానికి చెందిన ఓ ఉపాధ్యాయుడి (డిప్యుటేషన్)తో ఈ పాఠశాల నడిచేది.

సమాచారం లేకుండా గైర్హాజరు

ఈ విషయమై ఎంఈఓ అక్బర్‌ను వివరణ కోరగా ఉపాధ్యాయుడు శ్రీశైలం విధుల్లో చేరిన మరుసటి రోజు నుంచి రావడం లేదు. ఎలాంటి అనుమతి లేకుండా పాఠశాలకు గైర్హాజరు అవుతున్నాడు. అక్కడ ఉండే ఐదుగురు పిల్లలను దొంతాన్‌పల్లిలోని ప్రాథమిక పాఠశాలకు పంపిస్తున్నాం.



డాటా ఎంట్రీని పరిశీలిస్తున్న డీపీవో సురేశ్‌మోహన్

డాటా ఎంట్రీలో తప్పులు ఉండొద్దు

» జిల్లా పంచాయతీ అధికారి సురేశ్‌మోహన్

కొత్తూర్, నవంబర్ 27:(ఆంధ్రజ్యోతి): కులగణనకు సంబంధించి డాటాను తప్పులు లేకుండా ఎంట్రీ చేయాలని జిల్లా పంచాయతీ అధికారి సురేశ్‌మోహన్ ఆపరేటర్లకు సూచించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంతో పాటు మండల పరిధిలోని గుడూర్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న డాటా ఎంట్రీ ప్రోగ్రామ్‌ను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాటా ఎంట్రీలో తప్పులు లేకుండా పరిశీలించి చేయాలన్నారు. ఉన్నతాధికారుల సలహాలు, సూచనలు తీసుకుని ప్రోగ్రామ్‌ను పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో డాక్టర్ అరుంధతీ, ఎంపీవో విజయలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ బాలాజీ, గ్రామ కార్యదర్శి సురేందర్, డాటా ఏంట్రీ అపరేటర్లు పాల్గొన్నారు.

కాలుష్యకారక కంపెనీల ఏర్పాటు వద్దు

» పాలమూరు అధ్యయన వేదిక డిమాండ్

వికారాబాద్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కాలుష్యకారక ఇథనాల్, ఫార్మా కంపెనీల ఏర్పాటును రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని పాలమూరు అధ్యయన వేదిక డిమాండ్ చేసింది. ప్రభుత్వాలు రాష్ట్ర మౌలిక లక్ష్యాలను గాలికి వదిలేసి రైతాంగాన్ని, పర్యావరణాన్ని బలి తీసుకునే రాజకీయార్థిక విధానాలను అమలు చేస్తున్నాయని ఆరోపించారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వానికి, గత బీఆర్ఎస్ ప్రభుత్వానికి, ప్రస్తుత రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వానికి తేడా లేనే లేదన్నారు. అన్ని పార్టీలు కార్పొరేట్ల కోసమే పని చేస్తున్నాయని ఆ వేదిక కన్వీనర్ ఎం.రాఘవాచారి బుధవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో విమర్శించారు. నూతన ఆర్థిక విధానాల పేరున బహుళ జాతి కంపెనీలు దేశ విదేశ కార్పొరేట్ పెట్టుబడుల ప్రయోజనాకు అనుగుణమైన విధానాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు పరుస్తున్నాయన్నారు. అప్పటి నుంచి రైతులు భూములు కోల్పోతూ నిర్వాసితులుగా మారిపోవడం పెరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు.

కార్పొరేట్ విధానాలకు లొంగొద్దు

కేంద్ర ప్రభుత్వం ఇథనాల్ పాలసీ తీసుకువచ్చి ఆ కంపెనీల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వాల మీద ఒత్తిడి తీసుకువస్తోందని మండిపడ్డారు. రాష్ట్రంలో 30 ఇథనాల్ కంపెనీలు రాబోతున్నాయని తెలిపారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద ధన్వాడలో, దిలావర్‌పూర్‌లో ఇథనాల్ కంపెనీల ఏర్పాటును ప్రోత్సహిస్తోందన్నారు. లగచర్ల ఫార్మా కంపెనీల మాదిరిగా రాష్ట్రంలో 20కి పైగానే ఫార్మా కంపెనీలు రాబోతున్నాయన్నారు. ఆయా కంపెనీల రాకతో తెలంగాణ భూములు కలుషితమవుతాయన్నారు. ప్రజలు రోగాల బారిన పడతారంటూ ఆందోళన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి చొరవ తీసుకుని కేంద్ర విధానాలకు కార్పొరేట్లకు లొంగకుండా ఇథనాల్, ఫార్మాకంపెనీల ఏర్పాటుకు పాలసీని ఉప సంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

డిసెంబర్ 5వరకు రీసెర్చ్ మెథడాలజీ తరగతులు

» ఓయూలో ఆఫ్‌లైన్ విధానంలో నిర్వహణ

» శామీర్‌పేట ఐపీఈ డైరెక్టర్ శ్రీనివాసమూర్తి



మాట్లాడుతున్న డైరెక్టర్ శ్రీనివాసమూర్తి

శామీర్‌పేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): శామీర్‌పేటలోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైస్(ఐపీఈ) ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఓయూ క్యాంపస్‌లో నవంబరు 25న ప్రారంభమైన గుణాత్మక, పరిమాణాత్మక పరిశోధన (రీసెర్చ్ మెథడాలాజీ) కోర్సు డిసెంబర్ 5 వరకు 10 రోజుల పాటు ఆఫ్‌లైన్‌లో నిర్వహిస్తున్నట్లు ఐపీఈ డైరెక్టర్ శ్రీనివాసమూర్తి తెలిపారు. బుధవారం శామీర్‌పేటలోని ఐపీఈ క్యాంపస్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మీడియాకు వెల్లడించారు. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రిసెర్చ్ (ఐసీఎస్ఎస్ఆర్) సహకారంతో అప్లికేషన్ ఆఫ్ ఇన్నోవేటివ్ టూల్స్ అండ్ టెక్నిక్స్ పేరుతో సమగ్రంగా 10 రోజుల పాటు ఆఫ్‌లైన్‌లో ఈ కోర్సును ఐపీఈ నిర్వహించనున్నట్లు వివరించారు. పరిశోధనా అనేది సవాళ్లను అధిగమించడానికి, సంకల్పం, నిర్మాణాత్మక విధానం అవసరమయ్యే ప్రయాణమన్నారు. ఓయూ వీసీ ప్రొఫెసర్ కుమార్ మొలుగారం మాట్లాడుతూ నవంబరు 25న ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్‌లో రిసెర్చ్ మెథడాలాజీ కోర్సు సెషన్‌ను ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఐపీఈ ప్రోగ్రామ్ డైరెక్టర్ ప్రొఫెసర్ శ్రీధర్‌రాజ్ మాట్లాడుతూ ప్రత్యేకమైన రీచర్చ్ మెథడాలాజీ కోర్స్ పరిశోధకులకు అవసరమైన సాధనాలు, సాంకేతికతలతో వారి విద్యాపరమైన దృఢత్వాన్ని మెరుగుపర్చడానికి ఉపయోగపడుతుందన్నారు.

ఫ్లైఓవర్‌ను పొడిగించండి

» రైల్వే డీఆర్‌ఎంకు వినతి

కొత్తూర్, నవంబర్ 27 (ఆంధ్రజ్యోతి): కొత్తూర్ మున్సిపాలిటీ పరిధిలోని తిమ్మాపూర్ రైల్వేస్టేషన్‌లోని ఫ్లైఓవర్‌ను పొడగించాలని కోరుతూ మున్సిపల్ వైస్ చైర్మన్ డోలీ రవీందర్ ఆధ్వర్యంలో గ్రామస్తులు సికింద్రాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ లోకేశ్‌విష్ణుకు బుధవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఇందుకు డీఆర్‌ఎం సానుకూలంగా స్పందించారని రవీందర్ తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పసుపుల సుధాకర్, బూరుగుల సురేశ్, సత్యనారాయణ, డోలీ రాజు, ప్రకాష్‌గౌడ్, మొగిలిద్ద శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పిల్లి సుధాకర్

మాల, మాదిగల మధ్య చిచ్చుపెట్టొద్దు

» జాతీయ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్

శామీర్‌పేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఓటు బ్యాంకు రాజకీయాల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాల, మాదిగల మధ్య వైశమ్యాలను తీసుకురావద్దని జాతీయ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ మండిపడ్డారు. మాలలపై జరుగుతున్న అసత్య ప్రచారం, అశాస్త్రీయమైన ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న మాలల మహా పాదయాత్ర బుధవారం శామీర్‌పేటకు చేరుకుంది. ఈ సందర్భంగా పిల్లి సుధాకర్ శామీర్‌పేటలోని అంబేడ్కర్ విగ్రహానికి వారు పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. అశాస్త్రీయమైన ఎస్సీ వర్గీకరణ, మాలల పై చేస్తున్న అసత్య ప్రచారాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మానుకోవాలని హెచ్చరించారు. రాజ్యాధికారం కోసం పాలకులు కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోదీ రాసిచ్చిన స్లిప్పును న్యాయమూర్తులు చదివి దళితుల మధ్య అనైక్యత తీసుక వచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు చిప్పల నర్సింగ్‌రావు, జిల్లా అధ్యక్షుడు కందుల శ్రీనివాస్, దళిత సేన నాయకులు మురళీకృష్ణ, వజ్జేల మురళీ, నీరుడి బాలేష్ పాల్గొన్నారు.



కరపత్రాలను విడుదల చేస్తున్న మాల మహానాడు నాయకులు

మాలల సింహగర్జనను విజయవంతం చేయాలి

మహేశ్వరం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా డిసెంబరు 1న సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో జరగబోయే తెలంగాణ మాలల సింహ గర్జన భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని రాష్ట్ర మాలల ఐక్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు బేర బాలకిషన్ అన్నారు. బుధవారం తుక్కుగూడలో మాల మహానాడు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణాలో 30 సంవత్సరాలుగా ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందక పాలకులు తీరని అన్యాయం చేశారన్నారు. మనువాద మందకృష్ణ మాటలు నమ్మి కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు మాలలను అనేక రకాలుగా నిర్లక్ష్యానికి గురి చేశాయన్నారు. కార్యక్రమంలో మండల మాల మమానాడు నాయకులు ఏకుల రాములు, పెంటమల్ల సురేశ్, యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

తూంకుంట నుంచి మందాయిపల్లికి నాలుగు లేన్ల రోడ్డు మంజూరు

» రూ.6.5 కోట్ల నిధులను మంజూరు చేసిన ప్రభుత్వం

శామీర్‌పేట, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): శామీర్‌పేట మండలం తూంకుంట నుంచి మందాయిపల్లి వరకు సెంట్రల్ లైటింగ్, డివైడర్‌తో నాలుగు లేన్ల బీటీ రోడ్డును ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిందని, తూంకుంట మున్సిపాలిటీ 14వ వార్డు కౌన్సిలర్ ఉమాఅంజనేయులు తెలిపారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం రూ. 6.5 కోట్ల నిధులను మంజూరి చేసిందని, అలాగే వర్క్ టెండర్ ప్రాసెస్‌ను కూడా పూర్తి చేసిందని తెలిపారు. త్వరలో ఈ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించనున్నట్లు కౌన్సిలర్ తెలిపారు.

సమస్యాత్మక ప్రాంతాల్లో సీసీ కెమెరాలు తప్పనిసరి



రికార్డులను పరిశీలిస్తున్న డీసీపీ శ్రీనివాస్

శంకర్‌పల్లి, నవంబరు27(ఆంధ్రజ్యోతి): దేవాలయాలు, మసీదులు, చర్చీలలో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్ సూచించారు. నార్సింగి ఏసీపీ రమణ గౌడ్‌తో కలిసి ఆయన బుధవారం శంకర్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లోని పలు రికార్డులను పరిశీలించారు. కేసుల వివరాలను సీఐ శ్రీనివాస్‌గౌడ్‌ను అడిగి తెలుసుకున్నారు. సిబ్బందితో ముచ్చటించి వారి సమస్యలను తెలుసుకున్నారు. కేసులను వేగవంతంగా, పరిశోధనాత్మకంగా చేపట్టాలని ఆదేశించారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో స్నేహపూర్వకంగా మెలగాలని సూచించారు. వంద మంది పోలీసులకు ఒక సీసీ కెమెరా సమానమని అన్నారు. తప్పని సరిగా ప్రార్థనా స్థలాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

రైల్వేస్టేషన్ల అభివృద్ధికి సహకరించండి

» మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్



రైల్వే మంత్రికి వినతి పత్రం ఇస్తున్న ఈటల

మేడ్చల్‌టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మేడ్చల్ - మల్కాజ్‌గిరి జిల్లాలోని రైల్వే స్టేషన్లను సమగ్రంగా అభివృద్ధి పరచాలని కోరుతూ మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ బుధవారం ఢిల్లీలో కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినివైష్ణవ్‌ను కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. మేడ్చల్ రైల్వేస్టేషన్ అధునీకరణ, రైల్వే అండర్ పాస్ పనులు త్వరగా పూర్తి చేయించడంతో పాటు, మేడ్చల్ గండిమైసమ్మ మధ్య ఉన్న రైల్వేలైన్ వద్ద వంతెన ఏర్పాటు చేయాలని కోరినట్లు తెలిపారు.

లక్ష్మాపూర్‌లో సమస్యల తాండవం

- మాజీ సీఎం దత్తత గ్రామంలో ప్రజల ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు


లక్ష్మాపూర్ గ్రామం

మూడుచింతలపల్లి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మూడుచింతలపల్లి మండలంలో మాజీ సీఎం కేసీఆర్ దత్తత గ్రామం లక్ష్మాపూర్‌లో సమస్యలు తాండవిస్తున్నాయి. వాటిని తీర్చే వారు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి వేళ స్ట్రీట్‌లైట్లు వెలగడం లేదు. తాగునీటి సరఫరా పైపులు ఎక్కడికక్కడ లీక్ అవుతున్నాయి. జమయ్యే చెత్తను డంప్ యార్డుకు తరలించక వీధుల్లో పేరుకుపోతోంది. సమస్యలపై పంచాయతీ కార్యదర్శి పట్టించుకోవడం లేదని గ్రామస్తులంటున్నారు. నిధులు రావడంలేదంటూ సమస్యలను గాలికి వదిలేస్తున్నారని ఆరోపిస్తున్నారు. పంచాయతీ కార్యదర్శి ఎప్పుడు వస్తున్నారో? ఎప్పుడు పోతున్నారో తెలియడం లేదని గ్రామస్తులు చెబుతున్నారు. సెక్రటరీ వారంలో మూడు రోజుల కంటే ఎక్కువసార్లు రావడం లేదని అంటున్నారు. పంచాయతీ అధికారే లేకుంటే తమ సమస్యలు ఎవరు తీరుస్తారని ప్రశ్నిస్తున్నారు. గ్రామస్తుల విమర్శలపై పంచాయతీ కార్యదర్శి శోభారాణి స్పందిస్తూ.. తాను రోజూ విధులకు గ్రామానికి వస్తున్నట్టు చెప్పారు. డ్యూటీలో భాగంగా కొన్నిసార్లు కలెక్టరేట్ వెళ్తానని తెలిపారు. పంచాయతీ సిబ్బంది నామమాత్రంగా పనిచేస్తున్నారని, తానే అన్నీ చూసుకుంటున్నానని చెప్పారు.

గ్రామంలో సమస్యలు తీర్చేవారే లేరు



గ్రామంలో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయి. గ్రామంలో నీటి సరఫరా చేసే పైప్‌లైన్ చెడిపోయింది. దీంతో నీరంతా రోడ్లపై పారుతోంది. అలాగే స్తంభాలకు వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రి వేళ రోడ్డుపైకి వచ్చేందుకు జంకుతున్నాం.

\- చింతల ముత్యాలు, లక్ష్మాపూర్

ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు



గ్రామంలో నెలకొన్న సమస్యలపై పంచాయితీ కార్యదర్శిని సంప్రదించడానికి ప్రయత్నించినా అందుబాటులో ఉండడం లేదు. ఒకవేళ ఫిర్యాదు చేస్తే చూద్దాం చేద్దాం అంటున్నారు తప్పితే సమస్యలు తీర్చుడం లేదు. అధికారులైనా పట్టించుకొని గ్రామంలోని సమస్యలు పరిష్కరించాలి.

\- మంద స్వామి, లక్ష్మాపూర్

మున్సిపాలిటీలో సదుపాయాలు కల్పించేందుకు కృషి

మేడ్చల్ టౌన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలో మౌలిక సదుపాయాల కల్పించేందుకు కృషిచేస్తున్నట్లు మేడ్చల్ మున్సిపల్ చైర్ పర్సన్ దీపిక తెలిపారు. 14వ వార్డులో బుధవారం బుధవారం సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. అభివృద్ధిలో అందరూ కలిసిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కాలనీ వాసులు పాల్గొన్నారు.


సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ దీపికనర్సింహారెడ్డి తదితరులు

క్రైం కార్నర్

చెట్టును ఢీకొట్టిన కారు.. యువకుడి మృతి

- ముగ్గురికి తీవ్ర గాయాలు


ఫర్హాన్ అహ్మద్ మృతదేహం

మూడుచింతలపల్లి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): కారు చెట్టును ఢీకొన్న ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందగా ముగ్గురు గాయపడ్డారు. ఈ ఘటన తుర్కపల్లిలోని జినోన్ వ్యాలీ పరిధిలో బుధవారం తెల్లవారుజామున జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరానికి చెందిన నలుగురు స్నేహితులు ఫర్హాన్ అహ్మద్ అన్సారీ(23), షాకిర్, రిజ్వాన్, అబ్దుల్లా కలిసి కారు(టీఎస్11 ఈడబ్ల్యూ3209) కిరాయి తీసుకుని హైదరాబాద్ నుంచి కొండపోచమ్మకు డ్యాంకు వద్దకు బయల్దేరారు. కారును అజాగ్రత్తతో నడిపి కొల్తూర్ సమీపంలో చెట్టును ఢీకొట్టారు. డ్రైవింగ్ చేస్తున్న షాకిర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అతడి పక్కన కూర్చున్న ఫర్హాన్ తలకు గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. రిజ్వాన్, అబ్దుల్లాలకూ గాయాలయ్యాయి. ప్రమాదంపై స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. అక్కడికి పోలీసులు చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టంకు, క్షత గాత్రులను ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

120గ్రాముల గంజాయి స్వాధీనం


గంజాయి పట్టుకున్న ఎక్సైజ్ అధికారులు

వికారాబాద్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): అందిన సమాచారం మేరకు ఓ వ్యక్తి వద్ద ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ 120 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకుంది. టాస్క్‌ఫోర్స్ సీఐ కె.శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం పట్టణంలోని రాజీవ్ నగర్ కాలనీకి చెందిన ఎండీ ఫయాజ్ గంజాయి రవాణా చేస్తున్నట్టు సమాచారం వచ్చింది. ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ దాడి చేసి ఫయాజ్‌ను తనిఖీ చేయగా అతడి స్కూటీలో 120 గ్రాముల ఎండు గంజాయి లభించిందన్నారు. నిందితుడు ఫయాజ్‌ను రిమాండ్‌కు తరలించామని చెప్పారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్‌ఐ ప్రేమ్‌కుమార్‌రెడ్డి, సిబ్బంది విష్ణువర్ధన్‌రెడ్డి, హన్మంతు, శివప్రసాద్ పాల్గొన్నారు.

సెంట్రింగ్ సామగ్రి ఎత్తుకెళ్లిన వ్యక్తిపై కేసు

ఘట్‌కేసర్ రూరల్, నవంబరు27(ఆంధ్రజ్యోతి): సెంట్రింగ్ జాకీలు, డబ్బాలను ఎత్తుకుపోయిన వ్యక్తిపై పోచారం ఐటీ కారిడార్ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ రాజువర్మ తెలిపిన వివరాల ప్రకారం.. జోడిమెట్ల సమీపంలో ఏస్ అపార్టుమెంట్ కడుతున్నారు. యేడాది క్రితం ఇమ్రాన్(25)ను సూపర్‌వైజర్‌గా పనిలోపెట్టుకున్నారు. ఇమ్రాన్ సరిగా పనిచేయడం లేదని ఆరు నెలల క్రితం పని నుంచి తొలగించారు. ఈ నెల 24న రాత్రి ఇమ్రాన్ టాటా ఏస్ వాహనంతో వచ్చి 50సెంట్రింగ్ జాకీలు, సెంట్రింగ్ బాక్స్‌లు, ఇతర సామగ్రి ఎత్తుకపోయాడు. ఇది గుర్తించి సైట్ ఇంజినీర్ మురళిగణేష్ ఫిర్యాదు మేరకు ఇమ్రాన్‌పై కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

విద్యుత్ షాక్‌తో ఆవు మృత్యువాత



పూడూరు,నవంబరు 27(ఆంధ్రజ్యోతి): కరెంట్ షాక్‌తో ఆవు మృతిచెందింది. వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని వెంకటేష్‌కు చెందిన ఆవు మన్నెగూడ మార్కెట్ వద్ద విద్యుత్ షాక్‌కు గురై మృతిచెందింది. ఆవు విలువ రూ.80వేల వరకు ఉంటుందన్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని వెంకటేష్ కోరాడు.

అదృశ్యమైన బాలిక కోసం ముమ్మర గాలింపు


బాలిక ఫొటోతో గాలిస్తున్న కరన్‌కోట్ పోలీసులు

తాండూరు రూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): దుకాణానికని ఇంటి నుంచి వెళ్లి అదృశ్యమైన బాలిక కోసం పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు. కరన్‌కోట్‌కు చెందిన స్వాతి తప్పిపోయిన విషయం తెలిసిందే. కేసు నమోదు చేసిన పోలీసులు బాలిక కోసం గాలిస్తున్నారు. నాలుగైదు రోజులుగా 12మంది పోలీసులు ఐదు బృందాలుగా బాలిక ఫొటోతో ఆచూకీ కోసం వెతుకుతున్నారు. బాలిక ఈ నెల 22న ఉదయం బస్సు ఎక్కి తాండూరు బస్టాండ్ వద్ద ఉదయం 10:20గంటలకు దిగి అక్కడే తిరిగినట్టు సీసీ కెమెరాల్లో రికార్డైంది. పోలీసులు బుధవారం తాండూరులో గాలించారు. బాలిక ఫొటోను హోటళ్లు, బస్టాండ్‌లు, పాన్ షాపులు, దుకాణాల వద్ద చూపుతూ వెతుకుతున్నారు. స్వాతి ఆచూకీ తెలిసిన వారు తాండూరు డీఎస్పీ సెల్: 8712670017, కరన్‌కోట్ ఎస్‌ఐ సెల్: 8712670052 నంబర్లకు సమాచారం ఇవ్వాలని ప్రజలను పోలీసులు కోరుతున్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

బషీరాబాద్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సేవాలాల్ తండాలో ఏఎంసీ చైర్మన్ జి.మాధవరెడ్డి, సొసైటీ వైస్‌చైర్మన్ అజయ్‌ప్రసాద్ బుధవారం సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. రూ.5లక్షలతో ఎమ్మెల్యే ఆదేశానుసారం సీసీ రోడ్డు పనులను ప్రారంభించామని చెప్పారు. ఏఎంసీ సభ్యులు అనూప్‌ప్రసాద్, నాయకులు కె.మాణిక్‌రెడ్డి, నాయకులు భీమప్ప, వడ్డె హన్మంతు, నరేష్, గోపాల్ తదతరులు పాల్గొన్నారు.


రోడ్డు పనులను ప్రారంభించిన నాయకులు

విద్యార్థులకు బహుమతుల అందజేత

దోమ, నవంబరు 27(ఆంధ్రజ్యోతి):దోమలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, కేజీబీవీ పాఠశాల విద్యార్థులకు రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఉపన్యాస పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బుధవారం బహుమతులు అందించారు. జిల్లా నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో మొదటి బహుమతి అనిల్‌కుమార్‌కు, సెకండ్ ప్రైజ్ శిరీషకు, థర్డ్ ప్రైజ్ వైష్ణవికి ఎంపీడీవో మహేశ్‌బాబు అందజేశారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి


కొడంగల్: హస్నాబాద్ జడ్పీహెచ్‌ఎస్‌లో బాలికలతో కలిసి భోజనం చేస్తున్న అధికారులు

కొడంగల్/మోమిన్‌పేట్/కొడంగల్ రూరల్/దోమ/నవాబుపేట/కులకచర్ల, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని కొడంగల్ తహసీల్దార్ విజయ్‌కుమార్, మున్సిపల్ కమిషన్ బలరాంనాయక్ అన్నారు. బుధవారం హస్నాబాద్ ఉన్నత పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. మోమిన్‌పేట్‌లోని జడ్పీహెచ్‌ఎస్‌లో ఆర్‌ఐ గోవర్ధన్ భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి, టీచర్ శంకర్ పాల్గొన్నారు. దోమ మండలం ఊట్పల్లి పాఠశాలను అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ సందర్శించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అంది ంచాలన్నారు. ఆర్డీవో వాసుచంద్ర, అధికారులు ఉన్నారు. నవాబుపేట మండలం యావపూర్ పాఠశాలను ఎంపీడీవో అనురాధ సందర్శించి భోజనాన్ని పరిశీలించారు. ఎంపీడీవోతో సూపరిడెంట్ అజయ్‌కుమార్ ఉన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భో జనం అందించాలని కొడంగల్ మండల ప్రత్యేక అధికారి జ్ఞానేశ్వర్, తహసీల్దార్ విజయకుమార్ అన్నారు. ఎరాన్‌పల్లిలో పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రంలో భోజనాన్ని తనిఖీ చేశారు. అలాగే గ్రామంలోని వడ్ల కొనుగోళ కేంద్రాన్ని పరిశీలించారు. దుద్యాల మండలం హస్నాబాద్ ఉన్నత పాఠశాలలో ప్రత్యేకాధికారి జ్ఞానేశ్వర్ భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం పెట్టాలని, వంట గదులను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. విద్యార్థులతో భోజనం చేశారు. ఎంపీడీవో ఉషశ్రీ, హెచ్‌ఎంలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. దోమ ఎంఈవో వెంకట్ కొత్తపల్లి, గుండాల తండా, దాదాపూర్ పాఠశాలలను సందర్శించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అంకిత స్వచ్ఛంద సంస్థ సమకూర్చిన బ్యాగ్‌లు, టైలు, బెల్టులు, ఐడీ కార్డులను కో-ఆర్డినేటర్ ప్రకాశ్‌కుమార్ విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అమర్‌నాథ్, కృష్ణ య్య, పంచాయతీ కార్యదర్శి మొగులయ్య, సిబ్బంది, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు, సీఆర్పీ రఘుసింగ్ పాల్గొన్నారు. కలెక్టర్ ఆదేశానుసారం దోమ మండల పాఠశాలల్లో భోజనం నాణ్యతగా అందిస్తున్నారా? లేదా అని పరిశీలించేందుకు మండల ఫుడ్ కమిటీలో తహసీల్దార్, ఎంపీడీవో, ఎంఈవో పని చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో డీటీ నర్సిములు, హెచ్‌ఎం శ్రీవిద్య, టీచర్లు పాల్గొన్నారు. చౌడాపూర్ మండలం వీరాపూర్ పాఠశాలను అధికారులు పరిశీలించారు. ఇన్‌చార్జి తహసీల్దార్ వెంకటేశ్‌చారి, ఎంఈవో రామచంద్రయ్య భోజనాన్ని పరిశీలించారు. టెన్త్ పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని తహసీల్దార్ మురళీధర్ అన్నారు. బండవెల్కిచర్ల బాలికల ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేశారు. భోజనం, నిత్యావసర సరుకులు, బియ్యాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈవో హబీబ్ అహ్మద్, హెచ్‌ఎం బాలవరలక్ష్మి ఉన్నారు.


కుల్కచర్ల: వీరాపూర్ పాఠశాలలో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తున్న తహసీల్దార్, ఎంఈవో

వీహెచ్‌పీ ఆధ్వర్యంలో 'భగవద్గీత' పోటీలు

తాండూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): విశ్వహిందూ పరిషత్ తాండూరు శాఖ ఆధ్వర్యంలో బుధవారం గీత జయంతి సందర్భంగా విద్యార్థులకు పాత తాండూరు కోటేశ్వరాయంలో భగవద్గీతలోని 5వ అధ్యాయనంపై పోటీలు నిర్వహించారు. ప్రతి విద్యార్థి భగవద్గీతను చదవాలని వీహెచ్‌పి తాండూరు శాఖ అధ్యక్షుడు మల్లారెడ్డి సూచించారు. ఆరు విభాగాల్లో విజేతలైన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ ప్రతినిధులు సుభాన్‌రెడ్డి, శివరాజ్, నారాయణరెడ్డి, కృష్ణయ్య, ప్రకాష్, బసవరాజ్, సాయిరెడ్డి, చంద్రయ్య, శివకుమార్, వెంకటయ్య, బస్వరాజ్, రాంరెడ్డి, మణిమాల, డి.కవిత, టీచర్ సరిత, తదితరులు పాల్గొన్నారు.

తాండూరులో చెస్ పోటీలు

తాండూరు,నవంబరు27(ఆంధ్రజ్యోతి):హిందూ ధార్మిక పరిషత్, తాండూరు ప్రైవేట్ పాఠశాలల సంఘం ఆధ్వర్యంలో తాండూరు చెస్ చాంపియన్-2024 పేరిట చెస్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. బుధవారం పోటీలకు సంబంధించి పోస్టర్‌ను ఆవిష్కరించారు. నిర్వాహకులు మాట్లాడుతూ అండర్-14, 16 విభాగాల్లో తాండూరులోని ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. ప్రతీ ప్రైవేటు పాఠశాల నుంచి నలుగురు విద్యార్థులు తుది పోటీలకు అర్హత సాధిస్తారన్నారు. డిసెంబరు 15 నుంచి 28వరకు పోటీలు నిర్వస్తామని, తుది పోటీలో పాల్గొనే విద్యార్థులకు ప్రశంశాపత్రాలు, మెమొంటోలు ఇస్తామన్నారు. పోటీలకు భాష్యం జూనియర్ కళాశాల, యాపిల్ కిడ్స్, ప్లే స్కూల్ విద్యా సంస్థలు స్పాన్సర్లుగా వ్యవహరిస్తామని వెల్లడించారు.

సాంకేతిక నైపుణ్య శిక్షణ కేంద్రంగా ఐటీఐ కళాశాల


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతం పోట్రు

మేడ్చల్ టౌన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మేడ్చల్ ఐటీఐ కళాశాలను అధునాత సాంకేతిక నైపుణ్య శిక్షణ కేంద్రంగా తీర్చిదిద్దుతామని కలెక్టర్ గౌతం తెలిపారు. మేడ్చల్ ఐటీఐ కాలేజీలో నిర్మిస్తున్న అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్ పనులను బుధవారం పరిశీలించారు. నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలను పాటించాలని, నిర్లక్ష్యం చేయొద్దని అధికారులను ఆదేశించారు. ఫ్లోరింగ్, సీడింగ్, ఎలక్ట్రిక్ వర్క్స్, కిటికీలు, పార్టిషన్ పనుల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. గడువులోపు పనులు పూర్తిచేయాలన్నారు. ట్రైనింగ్ విభాగంలో ఆరు గదుల్లో యంత్రాలను స్థాపిస్తామన్నారు. పనులన్నీ పూర్తిచేయాలని తెలిపారు. కార్యక్రమంలో చీఫ్ ఇంజినీర్ శ్యాంసుందర్, తహసీల్దార్ శైలజ, కమిషనర్ నాగిరెడ్డి, ఎంపీడీవో సంపూర్ణ ఉన్నారు.

హమాలీల అభ్యున్నతికి కృషి

తాండూరు రూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): హమాలీ కార్మికుల అభ్యున్నతికి కృషి చేస్తామని ఆర్పీఎల్ సీఈవో శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం తాండూరు గంజ్ హమాలీ సంఘం కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం జరిగింది. శ్రీనివాస్‌రెడ్డి, ఏఎంసీ బాల్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న హాజరయ్యారు. శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ గంజ్ హమాలీ, దడువై, చాట కార్మికుల సంక్షేమానికి తోడ్పాటు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ సోమశేఖర్, ది గ్రెయిన్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకట్‌రాములుగౌడ్, ప్రధాన కార్యదర్శి కిరణ్‌కుమార్, గంజ్ వ్యాపారులు, కార్మికులు పాల్గొన్నారు. కాగా కార్మిక సంఘం గౌరవాధ్యక్షుడిగాభీమప్ప, అధ్యక్షుడిగా మస్తిపురం చిన్న అంజప్ప, ఉపాధ్యక్షులు డి.అశోక్, జె.అశోక్, ప్రధాన కార్యదర్శిగా చంద్రబండ నర్సింహులు ఎన్నికయ్యారు.

విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

పరిగి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ప్రాథమిక దశ నుంచే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని పరిగి మున్సిఫ్ కోర్టు న్యాయాధికారి నాగుల శిల్ప అన్నారు. పరిగిలోని ఎస్టీ బాలికల రెసిడెన్షియల్/కళాశాలలో బుధవారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ.. విద్యతోపాటు చట్టాలపై తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో కృషిచేయాలని సూచించారు. చదువు జీవితంలో చాలా ముఖ్యమన్నారు. చదువుకున్నవారి జీవనం ఇతరులకు భిన్నంగా ఉంటుందన్నారు. బాలికలకు ఎలాంటి ఇబ్బదులు ఎదురైనా, వేధింపులకు గురిచేసిన పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. పోలీసులు స్పందించకుంటే నేరుగా తనకు ఫిర్యాదు చేస్తే, చర్యలు తీసుకుంటానని తెలిపారు. బాల్యవివాహాల నిర్మూలనకు కృషి చేయాలన్నారు. 18ఏళ్ల లోపు బాలికలకు పెళ్లి చేయవద్దన్నారు. ఎక్కడైనా జరిగితే నిలిపివేయాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది కె.నరేంద్ర యాదవ్, లీగల్ ఎయిడ్ కౌన్సిలర్ గౌసపాషా, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పరిగి కోర్టు న్యాయాధికారి శిల్ప

బాల్య వివాహాల నిర్మూలనకు కృషిచేయాలి


మర్పల్లి: ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, అంగన్‌వాడీ టీచర్లు, ఉపాధ్యాయులు

మర్పల్లి/తాండూరు/బంట్వారం/పూడూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతొక్కరూ కృషిచేయాలని స్పందన మండల కో-ఆర్డినేటర్ యాద య్య అన్నారు. బాల్య వివాహాల నిర్మూలన దినోత్సవం సందర్భంగా బుధవారం కొత్లాపూర్, బూచన్‌పల్లి, మర్పల్లి గ్రామాల్లో విద్యార్థులతో అంగన్‌వాడీ టీచర్లు, ఉపాధ్యాయులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. సిరిపురంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. బాల్య వివాహాలతో మహిళలకు ఆరోగ్య సమస్యలొస్తాయని తాండూరు మండల లీగల్ సర్వీసెస్ ప్యానెల్ న్యాయవాదులు జిలానీ, మస్తాన్ తెలిపారు. తాండూరులోని విజయ విద్యాలయ హైస్కూల్‌లో చైల్డ్ మ్యారేజ్ నిరోధక చట్టం-2006పై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. అమ్మాయిలకు కనీసం 18 సంవత్సరాలు, అబ్బాయికి 21 ఏళ్లు నిండిన తర్వాతే పెళ్లి చేయాలన్నారు. బాల్య వివాహా లు నేరం అన్నారు. కార్యక్రంలో లీగల్ సర్వీసెస్ క మిటీ ప్రతినిధి ప్రేమ్, హెచ్‌ఎంలు శరత్, కళ, ఉపాధ్యాయులు, రవి కుమార్ పాల్గొన్నారు. బాల్య వివాహాలను అరికట్టాలని బంట్వారం ఎంపీడీవో రాములు అన్నారు. ఆదర్శ పాఠశాలలో బాల్య వివాహ ముక్త్ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. బాలికలను బాగా చదివించి తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ధనలక్ష్మి, ఎంఈవో వెంకటేశ్వరరావు, ఎంపీవో నాగరాజు, ఏపీఎం దౌవులయ్య, ప్రిన్సిపాల్ బ్యూలా, మండల సమాక్య అధ్యక్షురాలు స్వరూప, పంచాయతీ కార్యదర్శి గోపాల్, అంగన్వాడీ టీచర్లు అనసూయ, రేణుకాదేవి, నరసమ్మ, పోలీసులు అశోక్, శ్రీకాంత్ పాల్గొన్నారు. బాలికలు బాల్య వివాహాలు చేసుకోవద్దని చెన్‌గోముల్ ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డి అన్నారు. పూడూరు మండలం ఎన్కెపల్లి మోడల్ స్కూల్‌లో బాల్య వివాహాల నివారణ, పోక్సో చట్టంపై అవగాహన నిర్వహించారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ వెంకటేశం, ప్రొటెక్షన్ ఆఫీసర్‌కృష్ణవేణి, ప్రిన్సిపాల్ సరళ హాజరయ్యారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం, పోలీసులు, విద్యార్థులు పాల్గొన్నారు.


ఎన్కెపల్లి మోడల్ స్కూల్‌లో మాట్లాడుతున్న ఎస్‌ఐ మధుసూదనరెడ్డి

సన్నాలకు సున్నం!

(5వ పేజీ తరువాయి)

తీసుకుంటామని చెబుతున్నారు. వ్యవసాయ పొలాల్లో సాగుచేసే పంటలు అన్ని ఒకేసైజులో రావడం ఎలా కుదురుతుందని రైతులు పేర్కొంటున్నారు. ఒకే రకం ధాన్యం ఒకపొలంలో ఒకలా మరోపొలంలో మరోలా వస్తుందని చెబుతున్నారు. సాగు అనేది యంత్రంలో వేసి తీసేది కాదని, అన్ని ఒకే సైజు ధాన్యం ఎలా వస్తుందని రైతులు ప్రశ్నిస్తున్నారు. ధాన్యంలో తాలులేకుండా, బాగా ఎండపెట్టి గాలికిపోసుకుని తీసుకురమ్మంటే ఫరవాలేదు కానీ, గింజలు అన్ని ఒకేసైజు ఉండాలంటే ఎలా కుదురుతుందని మండిపడుతున్నారు. ప్రభుత్వం ఇచ్చే మద్దతుధర, బోనస్ కలిపితే రూ 2,820 అవుతుందని, కానీ ప్రైవేటుకు తీసుకుపోతే ఎలాంటి కొర్రీలు లేకుండా రూ 2,720కి కొనుగోలు చేస్తున్నారని పేర్కొంటున్నారు. అందుకే రైతులు సన్నధాన్యాన్ని ధారూర్ మార్కెట్‌కు తరలిస్తున్నారు. క్వింటాల్‌కు వందరూపాయలు నష్టంతో పాటు ట్రాన్స్‌పోర్టు భారం కూడా రైతులపై పడుతోంది. ప్రభుత్వం కొనుగోలు చేసేందుకు కొర్రీలు పెడుతుండడంతో రైతులు బయటి మార్కెట్‌లో విక్రయించి కొంతమేర నష్టాలకు గురవుతున్నారు. సన్నధాన్యం, దొడ్డురకం వడ్లను చూడగానే చెప్పొచ్చని, అలాంటిది అధికారులు, నిర్వాహకులు యంత్రాలలో వేసి అందులో పాసైతేనే తీసుకుంటామని కొర్రీలు పెట్టడం మానుకోవాలని రైతులు కోరుతున్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతుధరతో పాటు బోనస్ రైతులకు అందేవిధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సన్నరకాలు, దొడ్డురకాలను కంటితో చూసి గుర్తించవచ్చు

సన్నరకాలు, దొడ్డురకాల వడ్లను కంటితో చూసి గుర్తించవచ్చు. ధాన్యం గింజను వలిచి యంత్రంలో వేసి అందులో గుర్తించిన సైజులో ఉంటేనే అది సన్నరకం అని చెప్పడం సరైనపద్ధతి కాదు. ప్రభుత్వం రైతులకు మద్దతు ధర, బోనస్ చెల్లించాలనుకుంటే సన్నరకాలను యంత్రాలతో కొలవాల్సిన అవసరం లేదు. కావాలంటే వడ్లను బాగా ఎండబెట్టి, గాలికి పోసి తీసుకురమ్మంటే బాగుంటుంది. వ్యవసాయం చేసి పండించే గింజలు యంత్రంలో వేసి తయారు చేసేవికాదు. ఒక్కో విత్తనం ఒక్కోరకంగా ఉంటుంది. కాబట్టి సన్నవడ్లను సన్నవడ్లుగా గుర్తిస్తే చాలు. అధికారులు రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

\- గొబ్బురు బాలప్ప (మంబాపూర్)

ప్రయాణం.. ప్రాణ సంకటం

(5వ పేజీ తరువాయి)

ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా జిల్లాలో ఆర్టీసీ బస్సులను నడపక ప్రైవేటు వాహనాలు పెద్దఎత్తన పెరిగాయి. రోజూ వేలాదిమంది ప్రయాణికులు మేడ్చల్‌నుంచి నగరంలోని పరిశ్రమల్లో, వ్యాపార సంస్థల్లో పనిచేసేందుకు వస్తుంటారు. జిల్లాలో పెద్దఎత్తున ఇంజినీరింగ్ కళాశాలలు ఉన్నాయి. వేలాది మంది విద్యార్థుల రాకపోకలు జరుగుతున్నాయి. ఇంజినీరింగ్ విద్యార్థులకు ఆయా కళాశాలల యాజమాన్యాలు ప్రత్యేకంగా బస్సు సౌకర్యాన్ని కల్పిస్తున్నా అనేక మంది విద్యార్థులు బస్సుల్లో కళాశాలలకు వచ్చి వెళ్తున్నారు. దీంతో ఉదయం, సాయంత్రం బస్సులు కిక్కిరిస్తున్నాయి. మేడ్చల్ ఆర్టీసీ డిపోలో వందకుపైగా మాత్రమే బస్సులున్నాయి. ఈ సంఖ్య 150కి చేరినా తక్కువేనని స్థానికులంటున్నారు. కుషాయిగూడ, బోడుప్పల్ డిపోల్లో కూడా వందకు పైగానే బస్సులు ఉన్నాయి. ప్రభుత్వం ఆర్టీసికి కొత్త బస్సులు కేటాయిస్తున్నా జిల్లాలోని డిపోల్లో బస్సుల సంఖ్య మాత్రం మారడం లేదు. ఉదయం సాయంత్రం వేళల్లో బస్సులు ఫుల్ అవుతుండడంతో విద్యార్థులు ఫుట్‌బోర్డ్‌పై వేలాడుతూ ప్రయాణిస్తున్నారు. బస్సుల డ్రైవర్లు బస్టాప్‌ల్లో విద్యార్థులను చూసి దూరంగా ఆపుతుండటంతో విద్యార్థులు బస్సుల వెంట పరుగెత్తాల్సి వస్తోంది. ఈ క్రమంలో విద్యార్థులు ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నారు. ఉపాధి, విద్య, వాణిజ్య రంగాల్లో జిల్లాలో పెద్ద ఎత్తున ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు స్థిరపడుతున్నారు. ఎప్పుడో గతంలో 15 ఏళ్ల క్రితం జనాభా ఆధారంగానే బస్సులు నడుస్తుండటంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. విద్యార్థుల, ఉద్యోగుల, ప్రయాణికుల, జిల్లా ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని అందుకనుగుణంగా ఆర్టీసీ అధికారులు బస్సు సర్వీసులను పెంచితే బాగుంటుందని జిల్లా ప్రజలు కోరుతున్నారు. ముఖ్యంగా ఉదయం సాయంత్రం వేళల్లో సర్వీసులు పెంచిన ఎడల ఆర్టీసీకి ఆదాయం పెరగటంతో పాటు ప్రజల అవసరాలు తీరుతాయని ప్రజలు కోరుతున్నారు.

అంతర్రాష్ట్ర దొంగల ముఠాతో జాగ్రత్త

మూడుచింతలపల్లి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): బీదర్, గుల్బర్గా గ్యాంగ్‌స్టర్లు కొన్నిసార్లు స్థానికంగా సంచరిస్తున్నారని, వారిపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని శామీర్‌పేట్ సీఐ శ్రీనాథ్ హెచ్చరించారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. లేడీస్ సూట్లు, దుప్పట్లు అమ్ముతున్న ముఠా సంచరిస్తోందని అనుమానం వ్యక్తం చేశారు. దొంగల ముఠా దుస్తులు, ఇతర వస్తువులమ్మే వారిలా నటిస్తూ ఇళ్లు, షాపులను పొద్దటి సమయాల్లో చూసుకొని రాత్రిళ్లు దోచుకువెళ్తారని తెలిపారు. ప్రజలు, వ్యాపారులు కొత్త వ్యక్తులను ఇళ్లలోకి రానివ్వొద్దని, జాగ్రత్తగా ఉండాలని సీఐ కోరారు.

విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి

(5వ పేజీ తరువాయి)

ఎలాంటి అపోహాలు అవసరం లేదని, సుప్రీం కోర్టుసైతం దీనిపై తీర్పు ఇచ్చిందన్నారు. ఈవీఎంల ట్యాంపరింగ్‌కు అవకాశమే లేదన్నారు. ఇకపై అన్ని పాఠశాలల్లో నెలలో రెండుమూడు సార్లు అధికారులు తనిఖీ చేస్తారన్నారు. పంచాయతీ కార్యదర్శి నుంచి ఉన్నత స్థాయి అధికారి వరకు స్కూళ్లు, హాస్టళ్లను పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనాలు చేస్తారన్నారు. తాగునీటిపై దృష్టిపెట్టి ప్రతీ సోమవారం నీటి పరీక్షలు చేస్తామన్నారు. భోజన ఏజెన్సీలకు సెప్టెంబరు వరకు బిల్లులు ఇచ్చామని, మిగిలిన వాటిపై అధికారులతో మాట్లాడామన్నారు. శిథిలావస్థలోని వికారాబాద్ జెడ్పీ పాఠశాల మరమ్మతుకు రూ.6.5లక్షలు మంజూరు చేశామన్నారు.

మోడల్ పీహెచ్‌సీగా నవాబుపేట: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కాన్పుల సంఖ్య తగ్గిందని, నవాబుపేట పీహెచ్‌సీని మోడల్ ఆరోగ్య కేంద్రంగా ఎంపిక చేశామన్నారు. పీహెచ్‌సీల్లోనూ కాన్పులు జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ ఉన్నారు.

హాస్టళ్లు, స్కూళ్లలో ఆరోగ్య శిబిరాలు: ప్రభుత్వ హాస్టళ్లు, స్కూళ్లలో వైద్య శిబిరాలు నిర్వహించి ఆరోగ్యపరీక్షలు చేయాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ సూచించారు. జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయాన్ని పరిశీలించిన ఆయన, అధికారులతో సమావేశమయ్యారు. శీతాకాలంలో వచ్చే వ్యాధులపై సిబ్బందికి, విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులను చూసి అవసరమైన వారికి చికిత్సలందించి మందులు అందజేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఎంఅండ్‌హెచ్‌వో వెంకటరమణ, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో జీవరాజు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం డబ్బులు త్వరగా చెల్లించాలి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

బొంరాస్‌పేట్: గన్నీ బ్యాగులు లేక కొనుగోలు నిలిచిపోయాయని బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి కలెక్టర్ ప్రతీక్‌జైన్ స్పందించారు. బొంరాస్‌పేట్ కేంద్రానికి 5వేల బస్తాలను పంపించారు. కలెక్టర్ బొంరాస్‌పేట్, బుర్హాన్‌పూర్, మెట్లకుంట, తుంకిమెట్లలోని కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఇప్పటి వరకు రైతుల నుంచి సేకరించిన ధాన్యం వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో రైతుల కోసం అన్ని వసతులను కల్పించాలని సూచించారు. ధాన్యం సేకరించిన తర్వాత వెంటనే లారీల్లో లోడ్‌చేసి మిల్లులకు తరలించి వెంటనే అన్‌లోడ్ అయ్యేలా అధికారులు పర్యవేక్షించాలన్నారు. అనంతరం కలెక్టర్ ఎంపీడీవో కార్యాలయంలో డాటా ఎంట్రీ ప్రక్రియను పరిశీలించారు. తుంకిమెట్ల పాఠశాలను సందర్శించి విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందివ్వాలని ఏజెన్సీకి, టీచర్లకు సూచించారు. ఆయన మాట్లాడుతూ భోజన పథకాన్ని పకడ్బందీగా అమలు చేసేబాధ్యత అధికారులదన్నారు. కార్యక్రమంలో జిల్లా సివిల్ సప్లయిస్ అధికారి మోహన్‌బాబు, తహసీల్దార్ పద్మావతి, ఎంపీడీవో వెంకన్నగౌడ్, ఎంపీవో మహేశ్‌కుమార్, ఏవో తులసి, ఎంఈవో హరిలాల్ పాల్గొన్నారు.